అటవీ, భూ సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పాల్గొన్న అధికారులు

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న అటవీ, భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అటవీ, రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ సమస్యల విషయంలో సయోధ్య కుదర్చాలన్నారు. రెండు శాఖల అధికారులు మండలాల వారీగా సంయుక్తంగా తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా అటవీ శాఖాధికారి జ్ఞానేశ్వర్, భూ సర్వే ఏడీ రాంరెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, అటవీ రేంజ్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు తగిన విధంగా సేవలందించటానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులకు, ఎంపీడీవోలతో జూమ్ సమావేశం ద్వారా మాట్లాడారు. ఆరోగ్య కేంద్రం భవనాలపై నీరు నిలవడం, పైకప్పు నుంచి నీరు కారడం పగుళ్లు రావటం, నీటి సరఫరా, విద్యుత్తు, మురుగునీటి కాలువల సమస్యలున్నట్లయితే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఇందు కోసం అవసరమైన అంచనాలను రూపొందించి పంపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసులు నామమాత్రం.. తరలింపు నిరంతరం

యథేచ్ఛగా రేషన్ బియ్యం పక్కదారి

- పంచాయతీలు - 566
- జిల్లా జనాభా - 12.5లక్షలు
- ఆహార భద్రత కార్డులు - 2,41,500
- అంత్యోదయ - 26,865
- దుకాణాలు - 588
- నెలవారీ బియ్యం కోటా - 5,200 మెట్రిక్ టన్నులు

న్యూస్‌టుడే, పరిగి: పేదల ఆకలి తీర్చేందుకు ఉద్దేశించిన ప్రజా పంపిణీ వ్యవస్థ అక్రమాలకు నిలయంగా మారుతోంది. ఎవరు పడితే వారు ఎక్కడ పడితే అక్కడ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఈతతంగం జిల్లా వ్యాప్తంగా నిరాఘాటంగా కొనసాగుతున్నా అధికారుల చర్యలు మాత్రం నామమాత్రంగానే సాగటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పట్టుబడుతున్న సమయాల్లో చిన్న చిన్న కేసులు పెట్టి వదిలేయడంతో అక్రమార్కులు యథేచ్ఛగా చెలరేగి పోతున్నారు. ప్రధానంగా నియోజకవర్గ కేంద్రాల్లోని పౌర సరఫరాల గోదాములపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం అక్రమార్కులు మంచి అవకాశంగా మలుచుకుంటున్నారు.

ప్రభుత్వ ఖర్చు రూ.35, కొనేది రూ.10: కొందరు వ్యక్తులు చిన్నచిన్న వాహనాల ద్వారా గ్రామాల్లో తిరుగుతూ ఎవరికీ అనుమానం కలగకుండా ఇంటింటి తిరుగుతూ బియ్యం సేకరిస్తున్నారు. ఈ మొత్తం ఒక చోట చేర్చి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ప్రభుత్వం కిలో బియ్యాన్ని పేదలకు అందించేందుకు రూ.35 ఖర్చు చేస్తుండగా ఇక్కడ మాత్రం కిలో రూ.10చొప్పున కొంటున్నారు.


ధారూర్‌లో పట్టుకున్న రేషన్ బియ్యం

గుర్తించకూడదని నూకలుగా మార్పు

పల్లెల్లో కొనుగోలు చేస్తున్న వాటిని కొందరు బియ్యాన్ని నూకలుగా మరాడిస్తున్నారు. దీంతో ప్రజా పంపిణీ కింద సరఫరా చేస్తున్న బియ్యం ఎవరూ గుర్తుపట్టని విధంగా మారుతున్నాయి. తనిఖీల్లో నూకలు దొరికినా కేసులు ఉండవన్న ధీమాతో కొనసాగిస్తున్నారు.

ఇవిగో ఉదాహరణలు

- ముజాహిద్‌పూర్‌లో 300 కిలోల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు పరిగిలో గత నెల 12న పరిగిలో సేకరించిన 12 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు గమనించి పట్టుకున్నారు.
- వారం రోజుల క్రితం నవాబుపేట మండలం గుబ్బడి ఫతేపూర్‌లో ఐదు క్వింటాళ్ల బియ్యం పట్టివేత.
- నాలుగు నెలల క్రితం పూడూరు మండలం అంగడిచిట్టెంపల్లి గ్రామ స్టేజీ వద్ద తనిఖీలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మినీ వ్యానులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.
- ధారూర్ మండలం మోమిన్‌కలాన్‌లో గత నెల 15న ఓ వ్యక్తి వద్ద అక్రమంగా దాచి ఉంచిన 27క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పక్కాగా పర్యవేక్షణ - నవీన్‌కుమార్‌రెడ్డి, గోదాం ఇన్‌ఛార్జి

ప్రజా పంపిణీ విషయంలో అక్రమాలకు తావులేకుండా వ్యవహరిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రేషన్ దుకాణాలకు పంపిణీ చేస్తున్నాం. తరచూ దుకాణాలను పరిశీలించి మరింత పకడ్బందీగా ప్రజలకు అందే విధంగా కృషి చేస్తాం.

పోలీసులు అంకితభావంతో పనిచేయాలి


ఎస్పీ నారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డి

బంట్వారం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో పోలీసులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల భద్రతకు ఎప్పటికప్పుడు పోలీసులు గస్తీ కాయాలన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రఘు, రాములు, ఎస్ఐ మహిపాల్ రెడ్డి ఉన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సూచించారు. చెంగెష్‌పూర్ శివారులోని జ్యోతిబా ఫులే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, చట్టాలు, ఫిర్యాదులపై బుధవారం డీఎస్పీ అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ సంఖ్య, ఆధార్ వివరాలు వెల్లడించరాదన్నారు. సైబర్ నేరాలబారిన పడితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. వేధింపుల గురైతే టోల్ ఫ్రీ సంఖ్య 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. షీ బృందం సారథి శేఖర్, ప్రిన్సిపల్ శివగీత, కళాబృందం బాధ్యులు అశోక్, బుగిడి తులసీదాస్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు తప్పని ఆందోళన


జాతీయ రహదారిపై విద్యార్థుల బైఠాయింపు

పరిగి, న్యూస్‌టుడే: ఫీజు బకాయిలతోపాటు ఉపకార వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పరిగిలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు బీజాపూర్ -హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిగణేష్ మాట్లాడుతూ ఉపకార వేతనాలు అందకపోవడంతో ధ్రువపత్రాలు కళాశాల యాజమాన్యాలు ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శులు గణేష్, ప్రేమ్‌కుమార్, రఘు, ఇమ్రాన్, ధన్‌రాజ్, పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

సర్..మా గ్రామ సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యే బుయ్యనితో మాట్లాడుతున్న మైల్వార్ నివాసితులు

బషీరాబాద్, న్యూస్‌టుడే: 'సర్..మా గ్రామంలో రోడ్లు, మురుగు కాల్వలు, పొలాలకు వెళ్లే దారులు అధ్వానంగా మారాయి. నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయండి' అని బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామస్థులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. రూ. 3లక్షల నిధులతో మైల్వార్ గేట్ వద్ద బస్ షెల్టర్ పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికుల విన్నపాలను గంట పాటు ఓపికగా విన్నారు. పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానన్నారు. అక్కాలమ్మ చెరువు పనులు పూర్తి చేయించాలని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ అంతర్గత, సిమెంటు రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి నిధులు ఇస్తానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకట్‌రాంరెడ్డి, అజయ్‌ప్రసాద్, రోహిత్ మహరాజ్, శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, ఖలీద్, గ్రామనాయకులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి చేయూత


క్యాంటీన్ల నిర్వహణలో శిక్షణ పొందుతున్న మహిళలు

న్యూస్‌టుడే, వికారాబాద్ టౌన్: జిల్లాలో వ్యాపార రంగంలో మహిళలు రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కోటీశ్వరులుగా మార్చేందుకు అన్ని విధాలుగా ఆర్థిక చేయూతను అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ఈ క్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు పలువురికి ఆర్థిక చేయూతను కల్పించి వృద్ధిలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది.

14 అంశాల్లో ఉపాధి కల్పనకు తర్ఫీదు

- మండల సమాఖ్యలు: 19
- గ్రామ సమైక్యలు: 657
- స్వయం సహాయ సంఘాలు 15,610
- సభ్యులు: 1,63,329

ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా 14 అంశాలలో మహిళలకు ఉపాధి కల్పనకు చొరవ తీసుకుంటోంది. దీన్లో భాగంగా జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులను 'ఇందిరా మహిళా శక్తి పథకం' కింద ఎంపిక చేసేందుకు ప్రణాళికలను రూపొందించింది. ఆయా విభాగాల్లో శిక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. క్యాంటీన్ ఏర్పాటు చేసుకునే వారికి రూ.3 లక్షలు, మిల్క్ పార్లర్ నిర్వహణకు రూ.2 లక్షలు ప్రభుత్వం రుణాలు అందిస్తుంది. సభ్యులు వాటిని నెల వారీగా బ్యాంకుల్లో చెల్లించాలి. జిల్లాలో ఐదు మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, చేపల విక్రయ కేంద్రం, పెరటి కోళ్ల పెంపకం, రైతులకు అద్దె చెల్లింపు కింద పరికరాల పంపిణీ వంటివి ఏర్పాటు చేయాలనేది లక్ష్యం. ఇప్పటికే మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు కోసం వికారాబాద్, పరిగి మండలాలకు చెందిన ఇద్దరు సభ్యులు తీసుకుంటున్నారు. వీటిని రద్దీగా ఉండే ప్రాంతాలైన కలెక్టరేట్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి: శ్రీనివాస్, డీఆర్‌డీఓ

మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఆదుకునేలా రుణాలను ఇచ్చి ప్రోత్సహిస్తోంది. త్వరలోనే కలెక్టరేట్, వైద్యకళాశాలలో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.

తమ్ముడి మోసంపై క్షేత్రస్థాయి విచారణ

ఈనాడు కథనానికి స్పందన

వికారాబాద్, న్యూస్‌టుడే: తోడబుట్టిన తమ్ముడని నమ్మితే ఎకరా పొలానికి ఎసరు పెట్టాడని, న్యాయం చేయాలని ఓ అన్న వికారాబాద్ తహసీల్దారును ఆశ్రయించారని ఈ నెల 17న 'తమ్ముడని నమ్మితే అసలుకే మోసం' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం వికారాబాద్ తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) నరేష్ నారాయణపూర్ గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఎవరి వాటాకు ఏయే సర్వే నంబర్లలో ఎంత విస్తీర్ణం పొలం వచ్చిందని చూశారు. గతంలో ఒప్పంద పత్రంపై సంతకాలు చేసిన సాక్షులను విచారించారు. నివేదికను అధికారులకు నివేదిస్తామని ఆర్ఐ తెలిపారు.

ప్రకృతి సోయగం.. మనసు పరవశం



గాజీపూర్ వాగు చుట్టూ పచ్చని గుట్టలు. వాటి మధ్య నవాబుల కాలంలో నిర్మించిన కత్వ.. దాని మీదుగా జల సవ్వడులు. ఇంతటి అందమైన ప్రకృతిలో విహరిస్తే.. ఆ ఆనందం.. అనుభూతి మాటల్లో చెప్పలేనిది. అందుకనే జలసిరులను తిలకిస్తూ.. ఆటలాడుతూ చుట్టుపక్కల గ్రామాల యువకులు, పిల్లలే కాదు పట్టణం నుంచి కూడా సందర్శకులు వచ్చి సేద తీరుతున్నారు. సెలవు రోజుల్లో ప్రకృతి అందాలను చూసేందుకు పెద్ద ఎత్తున ఇక్కడికి వస్తున్నారు. అందాల ప్రకృతిలో విహరిస్తూ మానసిక ఒత్తిడుల నుంచి ఉపశమనం పొందుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దేముల్.

భాజపా బలోపేతమే లక్ష్యం


సభ్యత్వ నమోదులో పాల్గొన్న మాధవరెడ్డి

పరిగి, న్యూస్‌టుడే: పార్టీ బలోపేతమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజెవైఎం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌ఛార్జి బూనేటి మారుతీ కిరణ్ అన్నారు. బుధవారం పట్టణంలో చేపట్టిన సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు పార్టీ బలోపేతం ఎంతో అవసరమన్నారు. జిల్లా నాయకులు రాంచంద్రయ్య, విజయ్‌భాస్కర్, రాముయాదవ్, బాలకృష్ణారెడ్డి, నర్సింహా, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీరు ఎంతో సురక్షితం

పరిగి, న్యూస్‌టుడే: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే మిషన్ భగీరథ లక్ష్యమని ఇందుకోసం సహాయకులు సేవా భావంతో పనిచేయాలని భగీరథ ఎస్ఈ ఆంజనేయులు అన్నారు. మండల కార్యాలయంలో మంచినీటి సహాయకులకు జరుగుతున్న శిక్షణలో భాగంగా బుధవారం పాల్గొని అవగాహన కల్పించారు. 230 కిలో మీటర్ల దూరం నుంచి ఐదు ప్రాంతాల్లో ఎత్తిపోతల ద్వారా నీటిని తీసుకువచ్చి ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందజేస్తున్నట్లు చెప్పారు. డబ్బా నీరు మంచిది కాదనీ, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. గ్రామీణ మంచినీటి సరఫరా పరిగి డివిజన్ డీఈఈ సుబ్రహ్మణ్యం, ఏఈ విపుల్ పాల్గొన్నారు.

మూడో రోజూ స్తంభించిన ఈ-నామ్ సర్వర్

తాండూరు, న్యూస్‌టుడే: జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఈ-నామ్) సర్వర్ బుధవారం కూడా స్తంభించింది. దీంతో అధికారులు సాధారణ పద్ధతిలోనే వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలు నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో సర్వర్ సమస్య తలెత్తడంతో ఉత్పత్తుల కొనుగోళ్లు నిలిచిపోయిన విషయం తెలిసిందే.

ఆర్థిక లబ్ధికి కుదరని అవకాశం: జిల్లాలో అతిపెద్దదైన తాండూరు విపణిలో సాధారణ పద్ధతిలో జరిగిన ఉత్పత్తుల కొనుగోలుకు వ్యాపారులంతా ఒకే చోటకు రావడంతో ఎక్కువ ధరలు లభించే స్థితి లేదు. అదే ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరిగి ఉంటే వ్యాపారులు ఒకరికి తెలియకుండా మరొకరు వేర్వేరు ధరలను కోట్ చేసే వారు. డిక్లరేషన్ అనంతరం ఎవరు ఎక్కువ ధరకు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారో ఉత్పత్తులను వారికే విక్రయించి రైతులు ఆర్థిక లబ్ధి పొందే వారు. కానీ సర్వర్ సమస్య కారణంగా ఇది జరగ లేదు. తాండూరు విపణిలో సోయాబిన్, మినుములు, పెసలు సాధారణ పద్ధతిలోనే విక్రయాలు జరిగాయి. మినుములు 284, పెసలు 45, సోయాబిన్ 188 క్వింటాళ్ల చొప్పున అమ్మకమయ్యాయి. క్వింటాలు పెసలు రూ.6,507 నుంచి రూ.7,600, మినుములు రూ.5,000 నుంచి రూ.8,430, సోయాబిన్ 4,130 నుంచి రూ.4,300 చొప్పున ధర లభించింది.


రూ. 12 లక్షల విలువైన సొత్తు అపహరణ


బీరువా పగలగొట్టి చిందరవందరగా పడేసిన దొంగలు

బషీరాబాద్: పర్శ్యా నాయక్ గిరిజన తండాలోని మూడు ఇళ్లలో దొంగతనం జరిగిన సంఘటన బషీరాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని పర్శ్యానాయక్ తండాలో మంగళవారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో దొంగలు బయటి నుంచి అన్ని ఇళ్లకు గొళ్లెం పెట్టారు. తండాకు చెందిన పాండు, అనుషాబాయి కూతురును చూసేందుకు మంగళవారం ఉదయం వికారాబాద్‌కు వెళ్లారు. వీరి ఇంట్లోకి ప్రవేశించి 5తులాల బంగారు, 8 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. తండాకు చెందిన గోపాల్, షేనిబాయి దంపతులు అప్పుగా తెచ్చి బీరువాలో రూ.40వేలు పెట్టారు. దాని తాళాన్ని యంత్రంతో కత్తిరించి సామగ్రిని చిందరవందరగా పడేసి రూ.40వేల నగదుతోపాటు కొడుకు పెళ్లికి వచ్చిన ఇత్తడి, స్టీలు వంట సామగ్రిని అపహరించుకెళ్లారు. అనంతరం రాందాస్, పప్పీ బాయి కుమారుడు రాహుల్ ఇటీవల కొన్న రూ.15 వేల విలువైన ఫోన్‌ను చోరీ చేశారు. తాండూరు డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డి, గ్రామీణ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ గఫార్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఆధారాలను క్లూస్‌టీం సేకరించింది. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రత్యేక అవసరం.. గుర్తించేందుకు ప్రాధాన్యం


పాఠశాలలో వివరాల సేకరణ



ప్రశస్థ్ యాప్

ప్రశస్థ్ యాప్‌తో ఉపాధ్యాయుల సర్వే

జిల్లా విద్యా వ్యవస్థ ఇలా..

- ప్రభుత్వ పాఠశాలలు.. 1,018
- మోడల్ స్కూళ్లు.. 9
- కేజీబీవీలు.. 18
- ఎయిడెడ్, టీఎస్ఆర్ఈఐ.. 2
- యూఆర్ఎస్ 1
- ప్రైవేటు.. 183
- మొత్తం విద్యార్థులు.. 1,25,312

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట: ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. వారికి సంబంధించిన సమగ్ర వివరాలు ప్రభుత్వాల వద్ద అందుబాటులో లేకపోవడంతో దివ్యాంగ పిల్లలకు పూర్తిస్థాయిలో సంక్షేమ ఫలాలు అందడం లేదు. ఈ నేపథ్యంలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) పాఠశాల స్థాయిలో చదువుకుంటున్న విద్యార్థుల్లోని వివిధ రకాల వైకల్యాలను గుర్తించేందుకు 'ప్రశస్థ్ యాప్'ను రూపొందించింది. దీన్ని ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు సమ్మిళిత విద్య రిసోర్స్ పర్సన్లు (ఐఈఆర్‌పీ) డౌన్‌లోడ్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ యాప్ ఆధారంగా విద్యార్థులందరినీ పరిశీలించి వారిలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. యాప్ వినియోగంపై సమగ్ర శిక్ష రిసోర్స్ పర్సన్లు, పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని వైకల్యాలపై సర్వే చేస్తున్నారు. దీనికి సంబంధించి కథనం.

పైకి కనిపించేవే కాదు, అంతర్గతమైనవీ పరిశీలన: విద్యార్థుల్లో అన్ని రకాల వైకల్యాలు పైకి కనిపించే విధంగా ఉండవు. చాలా వాటిని పరిశీలన ద్వారా గుర్తించవలసి ఉంటుంది. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం విద్యార్థుల్లో 21 రకాల వైకల్యాలను యాప్ ద్వారా గుర్తిస్తారు. మొదటి దశలో సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ వారిలోని అవయవ లోపం, వినికిడి లోపం, మాట్లాడే తీరు, రంగులను గుర్తిస్తున్నాడా, ఎలా రాస్తున్నాడు, సరిగ్గా చదువుతున్నాడా, మనో వైకల్యం మొదలైన లోపాలను ప్రశ్నల ద్వారా నిశితంగా పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తారు. మొదటి దశలో ఏ ఒక్క ప్రశ్నకు అవును అనే సమాధానం వచ్చినా రెండో దశలో ఆ విద్యార్థిని రిసోర్స్ పర్సన్లు పరిశీలిస్తారు. అనంతరం వారి తల్లిదండ్రుల అనుమతితో పూర్తిస్థాయి వైద్య పరీక్షల కోసం వైద్యులకు సిఫార్సు చేస్తారు. నిర్ధారణ మేరకు వైకల్య ధ్రువీకరణ పత్రంతో పాటు విద్యా బోధనలో ఆ విద్యార్థిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచిస్తారు.

ప్రతి విద్యార్థిని పరిశీలిస్తారు

ఈ యాప్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయులు పరిశీలిస్తారు. విద్యార్థులకు టీచర్లతో చాలా దగ్గర సంబంధం ఉంటుంది కాబటి వారిలో ఉన్న లోపాలను సులభంగా గుర్తించగలుగుతారు. తరువాత వారికి ఎలాంటి చికిత్స అందించాలి, చదువులో ఎలాంటి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలో నిర్ణయించడానికి అవకాశం కలుగుతుంది.

- రేణుకాదేవి, డీఈవో.

జిల్లాకో సీఎన్‌జీ ప్లాంట్ అవసరం

పరిగి,న్యూస్‌టుడే: పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సీఎన్‌జీ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, బయోడీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు లింగంపల్లి చంద్రశేఖర్‌రావు అన్నారు. బుధవారం పరిగిలో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డీజిల్, పెట్రోల్ ఇంధనాల ద్వారా వెలువడే కాలుష్యం దశల వారీగా నివారించాలని చెప్పారు. పర్యావరణ కార్యకర్తలు రాజీవ్‌రెడ్డి, కృష్ణకాంత్, రాజశేఖర్, శ్రీనివాస్‌చారి, సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చేర్యాల విద్యార్థి



చేర్యాల, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాల్లో భాగంగా 19 ఏళ్లలోపు విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కర్రోల్ల చరణ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన చరణ్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నాడని, త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపక బృందం చరణ్‌ను అభినందిస్తూ సన్మానించారు.

హాకీ పోటీలకు ఎంపిక



సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి హాకీ అండర్- 14, 17 పోటీలకు మల్కాపూర్ శివారులోని ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14లో సోను, మహేర తంకీన్, చందన, ఇజ్రాయిల్, మహ్మద్ తకిఖాన్.. అండర్-17 పోటీలకు రిత్విక్, మహ్మద్ ఇస్మాయిల్ ఎంపికైనట్లు పాఠశాల ప్రతినిధులు చెప్పారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, శిక్షకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



క్రీడా జ్యోతిని అందజేస్తున్న బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సైదులు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, ఉజ్వల భవిష్యత్తుకు దారిచూపుతాయని బీసీ గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి బి.సైదులు అన్నారు. బుధవారం కొండపాకలోని మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ గురుకుల పాఠశాలల క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో మూడు రోజుల పాటు జరిగే క్రీడల్లో విద్యార్థులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్, పరుగుపందెం, చదరంగం పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని తెలిపారు. అంతకుముందు పాఠశాలలో క్రీడా జ్యోతిని వెలిగించి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో బీసీ గురుకుల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిరుపతి, కొండపాక బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ ఉన్నారు.

బాల ప్రతిభ.. భవిష్యత్తుకు నిచ్చెన

చదువులో ఉన్నతంగా బాలలు రాణించాలంటే కళలు, ఆటలు, ఇతర మంచి వ్యాపకాలు ఎంతో అవసరం. దీన్ని గుర్తించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తుండటంతో ఉత్తమ ప్రతిభ చాటుతూ రాణిస్తున్నారు. ఓవైపు చదువులో ఉత్తమ మార్కులు పొందుతూనే మరో వైపు నృత్యం, క్రీడల్లో ప్రతిభ చాటుతున్న బాలలపై కథనం.

పరుగే ప్రాణం



కొడంగల్: కొడంగల్ గిరిజన గురుకులంలో ఇంటర్ చదువుతున్న ఎం.సుభాష్ క్రీడల్లో చురుగ్గా పాల్గొంటూ విజయాలు సాధిస్తున్నాడు. పరిగి, కులకచర్ల, హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగిన పోటీలో పాల్గొన్నాడు. 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్ అభినందించారు.

ఉత్తమ వికెట్ కీపర్



కొడంగల్: కొడంగల్ గిరిజన గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆర్.సునిల్ క్రికెట్‌లో విజయాలు సాధిస్తున్నాడు. ఈ నెల 2న వికారాబాద్‌లో అండర్ 14 క్రికెట్ పోటీల్లో ఉత్తమ వికెట్ కీపర్‌గా సునిల్ బంగారు పతకం సాధించాడు. రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఇక్కడే 7వ తరగతి చదువుకొంటున్న సాగర్.. ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా రాణించి బంగారు పతకానికి అర్హుడయ్యాడు. ఫైనల్‌లో 29 బంతుల్లో 42 పరుగులు తీశాడు.

ఇటు చదువు.. అటు క్రీడలు



జహీరాబాద్: జహీరాబాద్ మండలం హోతి (కె) శివారులో గల తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న **నందిని** రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడల పోటీలకు ఎంపికైంది. అమ్మానాన్న కవిత, గోపాల్, శిక్షకులు సరిత, నాగయ్య ప్రోత్సాహంతో చదువు, క్రీడను సమన్వయం చేసుకుంటూ, రాణిస్తోంది. రోజూ తెల్లవారుజామునే లేచి వ్యాయామం, ఆట సాధన చేస్తుంది. స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ అండర్-17 విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

క్యూబింగ్‌లో పతకం



తాండూరు: తాండూరుకు చెందిన **కందుకూరి చైత్ర** రాష్ట్ర స్థాయిలో ఎస్ఎఫ్ఎ సంస్థ నిర్వహించిన రూబిక్స్ స్పీడ్ క్యూబింగ్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. అండర్-14 బాలికల విభాగంలో గచ్చిబౌలిలో పోటీ నిర్వహించగా 41 సెకన్లలో నిర్ణీత లక్ష్యాన్ని పూర్తి చేసింది. తాండూరు నేతాజీ గురుదేవ్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చైత్రను తల్లిదండ్రులు వాణి, రాజ్‌కుమార్ ప్రోత్సహించారు. తాను జాతీయ స్థాయిలో పోటీ పడాలని మెలకువలు నేర్చుకుంటున్నానని చైత్ర చెప్పింది.

ఎన్‌సీసీ వేదికతో గుర్తింపు



గజ్వేల్ గ్రామీణ: చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన అతను చదువుతోపాటు ఆటల్లో, ఎన్‌సీసీలో రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకుంటూ సత్తా చాటుతున్న గజ్వేల్ పట్టణానికి చెందిన **దూలం మణికంఠ** తల్లి మంగమ్మ టైలరింగ్ పనులు చేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని చదువులో, ఆటలో రాణిస్తున్నాడు. గత మేలో హైదరాబాద్ ఎన్‌సీసీ శిబిరంలో పాల్గొని ప్రతిభ చాటుకోవడంతో అధికారులు జాతీయస్థాయి ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపిక చేశారు. ఈనెల రెండో వారంలో తిరుపతిలో ట్రెక్కింగ్ జరిగింది. మణికంఠ ప్రశంసాపత్రం అందుకున్నాడు. భవిష్యత్తులో ఆర్మీలో చేరాలనేది కోరిక అని బాలుడు చెప్పాడు.

స్రగ్వీ ఆదర్శం



జోగిపేట: చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది జోగిపేటకు చెందిన 7వ తరగతి విద్యార్థిని **ఎ.స్రగ్వీ**. ప్రైవేటు బడిలో చదువుతోంది. తల్లిదండ్రులు శ్రీకాంత్, కరుణలు జోగిపేట క్రికెట్ కోచింగ్ కేంద్రంలో సంవత్సరం క్రితం చేర్పించారు. శిక్షకులు సల్మాన్, శివ వద్ద రాటుదేలుతోంది. నిత్యం ఉదయం 5 గంటలకే లేచి తండ్రితో కలిసి సాధన కోసం వెళ్తోంది. సాయంత్రం, సెలవు రోజుల్లోనూ సాధన చేస్తుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లలో పరిణతి పొందింది. సంగారెడ్డిలో ఎస్‌జీఎఫ్‌లో ప్రతిభ చాటి అండర్-17 పోటీలకు ఎంపికైంది.

రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం



తాండూరు: యాలాల మండలం ముకుందాపూర్‌కు చెందిన **అర్చన** రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో 2 కి.మీ. పరుగులో ప్రతిభ కనబరిచింది. బంగారు పతకాన్ని సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. యాలాల పాఠశాలలో 9వతరగతి చదువుతున్న అర్చన.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించే దిశగా సాధన చేస్తోంది.

నర్తిస్తారు.. మెప్పిస్తారు

వికారాబాద్ కలెక్టరేట్: వికారాబాద్ బాల కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థినులు శాస్త్రీయ, సంప్రదాయ పాటలు, భక్తి పాటలు, దేశభక్తి, జానపద పాటలకు అందరూ మెచ్చేలా నృత్యం చేస్తారు. గత నెలలో కాశీ విశ్వనాథస్వామి గుడిలో 'రావణకృత శివతాండవం' నృత్యం చేసి భక్తులను అలరించారు. శ్రేయాన్వి, అనన్య, రష్మిక, పరిణతమాంబ, సౌమ్య, సృజన, వేదశ్రీ, సంహిత, జాహ్నవి, భవిత, శ్రీనిధి పాల్గొన్నట్లు, ఆలయ ట్రస్టు నుంచి ప్రశంసాపత్రం అందుకున్నట్లు బాల కేంద్రం సూపరింటెండెంట్, శిక్షకురాలు టీపీ అనురాధ తెలిపారు. గతంలో హైదరాబాద్, విజయవాడ, చెన్నైలోనూ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు.



కాశీలో నృత్యం చేసిన బాలలు

అబ్బురపరిచే కళ



దుబ్బాక: దుబ్బాక మండలం రామక్కపేట విద్యార్థి బండి **క్రాంతికుమార్**.. చిన్నతనం నుంచే చిత్రలేఖనం (డ్రాయింగ్)పై మక్కువ పెంచుకున్నాడు. దుబ్బాక పురపాలికలోని లచ్చపేట ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు చంద్రకళ, భూమయ్య బీడీ కార్మికులుగా పని చేస్తూనే కుమారుడిని ప్రోత్సహిస్తున్నారు. పెన్సిల్, స్కెచ్, రంగులతో జాతీయ నాయకులు, దేవుళ్లు, ప్రకృతిని గీస్తూ అబ్బురపరుస్తున్నాడు. వర్గల్‌లో వికసిత్ భారత్‌పై చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చాటాడు. సమగ్రశిక్షా ఆధ్వర్యంలో సిద్దిపేటలో కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. నవంబరులో రాష్ట్రస్థాయిలో పాల్గొననున్నాడు.

12 కథలు రాసిన బాలిక



శరణ్యతో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్, ఉపాధ్యాయులు

హవేలీఘనపూర్: హవేలి ఘనపూర్ మండలం ఔరంగాబాద్‌కు చెందిన చెప్యాల మంజుల-సిద్ధయ్య దంపతుల కుమార్తె శరణ్య. హవేలి ఘనపూర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. బాలసాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీల్లో 'జయహో' కథ బహుమతికి ఎంపికైంది. శరణ్య రెండేళ్ల నుంచి కథలు రాస్తోంది. ఉపాధ్యాయుడు ఉండ్రాళ్ల రాజేశం మెలకువలు నేర్పించారు. బాలిక 12 కథలు రాసింది. గతంలో తెలంగాణ సారస్వత పరిషత్ నుంచి బహుమతి అందుకుంది.

క్రమశిక్షణలో ముందు



ప్రహర్షికి అభినందనలు

సిద్దిపేట అర్బన్: నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రహర్షి కథల పుస్తకాలు రాస్తూ తెలుగు సాహిత్యంలో రాణిస్తోంది. తల్లిదండ్రులు కారంకంటి కనకయ్య-రజిత. తండ్రి ఆటో నడుపుతున్నారు. తల్లి టైలరింగ్ చేస్తూ ముగ్గురు పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. 6వ తరగతి నుంచి ప్రహర్షి ప్రతిభ చాటుతోంది. నేషనల్ మీన్స్ మెరిట్ ఉపకార వేతనానికి ఎంపికైంది. అందమైన చేతిరాత బాలిక సొంతం. రోజూ ఉదయాన్నే 4 గంటలకు నిద్ర లేవడం అలవాటుగా చేసుకుంది. నాలుగు కథలు రాసింది. గతేడాది రాసిన మాంత్రికుని కోటలో చిన్న పిల్లలు కథల పుస్తకానికి రూ.500 బహుమతి అందుకుంది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో ప్రహర్షి రాసిన 'సాహసం' కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. నవంబరు 3న హైదరాబాద్‌లో ప్రదానం చేయనున్నారు.

శాకాహారమే శ్రేష్ఠమైంది

ధ్యాన కేంద్రంలో సూచనలు

నర్సాపూర్, న్యూస్‌టుడే: మాంసాహారం తినడం రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలను శాకాహారం వైపు మళ్లించడానికి కొన్ని సంస్థలు ప్రయత్నం చేస్తున్నాయి. మనిషిలో పలు రోగాలకు కారణం మాంసాహారమేనని, శ్రేష్ఠమైన ఆహారం అంటే శాకాహారమేనని వారు చాటిచెబుతున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఇటీవల పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. గతంలో సెలవుదినాలు, పండగలు, ఎవరైనా చుట్టాలు వచ్చినప్పుడు మాత్రమే మాంసాహారాన్ని తీసుకునేవారు. ప్రస్తుతం కూరగాయలు, పప్పు దినుసులతో వంట చేసుకొని భోజనం తగ్గిపోయింది. నిత్యం మూడు పూటలా మాంసాహారం ప్రాధాన్యం పెరిగిపోయింది. పిల్లల్లో చదువులపై, పెద్దలకు శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వారు చెబుతున్నారు. నర్సాపూర్ పట్టణంలో ర్యాలీలో నినాదాలు చేస్తూ.. మాంసాహారం వల్ల నష్టాలను వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. మూగజీవులను సంరక్షించండి, అహింసాయుత భూమాతను ఆవిష్కరించడంలో భాగంగా అవగాహన చేపడుతున్నట్టు తెలంగాణ పిరమిడ్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు పేర్కొన్నారు. ధ్యాన కేంద్రంలో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, బుద్ధి వికాసం, ఆత్మ జ్ఞానానికి ధ్యానం అవసరాన్ని బోధిస్తారు.

సాత్వికాహారంతోనే ఆరోగ్యం: రాములుయాదవ్, ధ్యాన కేంద్రం నిర్వాహకుడు

అనారోగ్యం కారణంగా 2011 నుంచి శాకాహారానికి మారాను. ఎంతో చలాకీగా ఉండగలుగుతున్నాను. సాత్వికాహారంతోనే ఆరోగ్యంగా ఉండగలం. ధ్యానం వలన ప్రయోజనాలు ఉన్నాయి.



నర్సాపూర్‌లో శాకాహారంపై ర్యాలీ

పెద్దల జ్ఞాపకం.. పదుగురికి ఉపయుక్తం

పరిగి, మోమిన్‌పేట, న్యూస్‌టుడే:

- మోమిన్‌పేటకు చెందిన మల్లేశం ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఉన్నట్టుండి స్పృహ కోల్పోయారు. ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు గంట నుంచి ఆటో కోసం కుటుంబ సభ్యుల వెదికారు. విషయం తెలిసిన అల్లుడు ఉచిత సేవలు అందిస్తున్న ఆటోను వినియోగించుకొని సకాలంలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.
- మోమిన్‌పేటకు చెందిన పల్లవి గర్భవతి. పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. ఊరిలోనే ఆసుపత్రి ఉన్నా దూరం కావడంతో ఆటోవాలాలు ఎవరూ రాలేదు. ఉచిత వాహనం సద్వినియోగమైంది.
- మల్లమ్మ తన కూతురు వద్దకు వెళ్లేందుకు ఇంటి నుంచి బస్టాండుకు బయల్దేరారు. మార్గమధ్యలో కాళ్లనొప్పులతో కూర్చున్నారు. ఓ మహిళ ఇచ్చిన సమాచారంతో ఆమెను బస్టాండులో ఉచిత వాహనంలో వదిలారు.



ఎలక్ట్రిక్ వాహనం ఇదే

పదుగురికి మేలు చేయాలన్న ఓ యువకుడి ఆలోచన ఆచరణలోకి వచ్చి వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో ఉపయోగపడుతోంది. ఒక్కోసారి ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఆటోవాలాలు, ఇతర వాహనదారులు డిమాండు చేసి డబ్బు తీసుకొని వాహనంలో తీసుకెళ్తారు. ఉచిత ప్రయాణంతో యువకుడు ఆదర్శంగా నిలుస్తున్నారు. మోమిన్‌పేటకు చెందిన మహంతిరెడ్డిగారి విష్ణు తమ తల్లిదండ్రులు మహంతిరెడ్డి, స్వప్నల పేరిట వృద్ధులు, గర్భిణులు, కాలినడకన వెళ్లే విద్యార్థుల కోసం ఉచిత ప్రయాణం అందించాలని భావించారు. ఇదే విషయాన్ని అన్న లక్ష్మీకాంత్‌రెడ్డి, సోదరి సుష్మారెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో అంగీకరించారు. రూ.6లక్షలు వెచ్చించి పర్యావరణానికి మేలు కలిగించే ఎలక్ట్రిక్ వాహనాన్ని బెంగళూరు నుంచి కొనుగోలు చేసి తెప్పించారు. గ్రామం చివరి నుంచి బస్టాండు వరకు రెండు కిలోమీటర్ల దూరం ఉండటంతో ఇది ఉపయోగపడుతోందని చెబుతున్నారు. ఈనెల 5న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనాథశ్రమంలో ఉంటూ బడికి వెళ్తున్న విద్యార్థులను ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచిత వాహనంలో తరలిస్తున్నారు.

బడికి తీసుకెళ్లే బస్సే బలిగొంది

సహాయకుడు లేకపోవడంతో చిన్నారిని ఢీకొట్టిన డ్రైవర్



చిన్నారి అశ్విని → ఘటనాస్థలంలో విలపిస్తున్న బంధువులు

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: నిత్యం టాటా చెబుతూ చిరునవ్వుతో బడికి వెళ్లే ఆ చిన్నారి ఆనందాన్ని చూసి విధికి కన్నుకుట్టిందేమో.. ప్రతి రోజూ పాఠశాలకు తీసుకెళ్లే బస్సే బాలిక పాలిట మృత్యుశకటంగా మారి బలి తీసుకుంది. క్షేమంగా తిరిగి వస్తుందనుకున్న తమ కూతురు తిరిగి రాని లోకాలకు వెళ్లిందన్న సమాచారం తెలుసుకుని కన్నవారు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పెద్దశంకరంపేట మండలం మక్తలక్ష్మాపురం గ్రామం వద్ద ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొని విద్యార్థిని దుర్మరణం చెందిన ఘటన బుధవారం జరిగింది. సీఐ రేణుక తెలిపిన ప్రకారం మక్తలక్ష్మాపురం గ్రామానికి చెందిన బోయిని చంద్రమోహన్, సరితలకు ఇద్దరు కుమార్తెలు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమార్తె అశ్విని (6) పెద్దశంకరంపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాల బస్సులోనే బడికి వెళ్లి, సాయంత్రం తిరిగి వచ్చింది. రోడ్డు దాటుతుండగా డ్రైవర్ చూసుకోకుండా బస్సును ముందుకు పోనివ్వడంతో అశ్వినిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో డ్రైవర్ పరారయ్యాడు. బస్సులోని విద్యార్థులు భయంతో ఇళ్లకు పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్, పాఠశాల యాజమాన్యం గ్రామానికి వచ్చే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని బంధువులు, గ్రామస్థులు రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసుల జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో విరమించారు. మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి దుర్మరణం



మహమూద్ మియా

పాపన్నపేట, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన ఘటన పాపన్నపేట శివారులో బుధవారం జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం యూసుఫ్‌పేటకు చెందిన మహమూద్ మియా (65) స్థానిక తపాలా కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందారు. బుధవారం మధ్యాహ్నం స్కూటీపై పాపన్నపేటకు కూరగాయల కొనుగోలుకు వస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వాహనం ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మహమూద్ మియాకు భార్య కౌసర్ సుల్తానా, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మూడు రోజుల కిందట చిన్న కుమార్తె నిశ్చితార్థం జరిగింది. అంతలోనే ఇలా జరగడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

ఎదురెదురుగా బైకులు ఢీకొని ఎలక్ట్రీషియన్..



బాలకృష్ణ

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దుంపల నాగమణి, విఠల్ కుమారుడైన బాలకృష్ణ (21) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. మానెపల్లి గ్రామానికి జంగల్ల భూమేశ్‌తో కలిసి వెళ్తున్నారు. మానెపల్లి నుంచి ఎదురుగా వస్తున్న తల్లీకుమారులు పెంటయ్య, నర్సమ్మల వాహనం ఢీకొంది. ప్రమాదంలో కింద పడిన బాలకృష్ణ తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. నర్సమ్మకు గాయాలు కావడంతో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణ తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



రాజిరెడ్డి

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మండలం కూచనపల్లికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి(55) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు. అక్కన్నపేట మండలంలో నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టులో గుడాటిపల్లి గ్రామం ముంపునకు గురైంది. దీనితో రాజిరెడ్డి కూచనపల్లిలో ఇల్లు నిర్మించుకున్నాడు. అతిగా మద్యం తాగడంతో ఆరోగ్యం చెడిపోయింది. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. ఈ నెల 22న తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్దూరు మండలంలో మరో యువకుడు..



రాజు

చేర్యాల(మద్దూరు), న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు గ్రామ రైతు కుటుంబానికి చెందిన పూల మల్లేశం- బూదమ్మ ఏకైక కుమారుడైన రాజు(22) బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. డిగ్రీ వరకు చదివిన రాజు కొన్నాళ్ల క్రితం వరకు స్థానిక పాల ఉత్పత్తిదారుల కేంద్రంలో పని చేశాడు. వ్యవసాయంలో తల్లిదండ్రులకు సాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పొలంలో తీసిన పత్తి విక్రయించిన అనంతరం సాయంత్రం తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కడుపులో నొప్పి వేస్తోందని తన మిత్రుడికి చెప్పడంతో వెంటనే లద్నూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు జనగామ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. అతని ఆత్మహత్యకు కారణం తెలియలేదు. ఈ ఘటనపై మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్‌ను అడుగగా ఆత్మహత్య సమాచారం ఉంది కానీ దానిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామన్నారు.



లెక్కిస్తున్న సిబ్బంది, సేవాసమితి సభ్యులు

వనదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.39.91 లక్షలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి హుండీల ద్వారా రూ.39,91,361 ఆదాయం సమకూరింది. దీనికి అదనంగా బంగారం, వెండి ఆభరణాల కానుకలొచ్చాయి. ఈవో చంద్రశేఖర్, హుండీ లెక్కింపు ఇన్‌ఛార్జి సుధాకర్‌రెడ్డి సమక్షంలో ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు గోకుల్‌షెడ్‌లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. 83 రోజుల్లో ఆ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

ఆధునిక పరికరం.. ప్రమాదాల నివారణం

న్యూస్‌టుడే, జిన్నారం:

పరిశ్రమల్లో చిన్న లోపం ఉన్నా ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే వ్యాపారులకు తెలిసేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తోంది. దీనివల్ల పరిశ్రమల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఉత్పత్తి ప్రాసెస్‌లో తేడా ఉంటే వ్యాపారులు వస్తువులను కొనరు. ఉత్పత్తి విషయంలోనైనా ప్రమాదాల నివారణకైనా ఆధునిక సాంకేతిక పరికరాల ద్వారా అప్రమత్తం అవుతున్నారు. పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కర్మాగారాల భద్రతా శాఖ యాజమాన్యాలను అప్రమత్తం చేస్తోంది.



రియాక్టర్ వద్ద ఆటోమేటిక్ యంత్రం

రియాక్టర్లు, రసాయనాల నిల్వ ప్రాంతాలు కీలకం

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం ఉంటుంది. యూనిట్లలో ఎక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటాయో అక్కడే దృష్టి సారిస్తున్నాయి యాజమాన్యాలు. రియాక్టర్, సెంటర్ ఫీజ్, బాయిలర్, చిల్లింగ్ పాయింట్, రసాయనాల నిల్వ ప్రాంతాల్లో పరికరాలు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రమాదాన్ని గుర్తించి వాటంతటవే నివారిస్తాయి. కార్మికులకు చిన్న పాటి ప్రమాదం జరిగితే అత్యవసర కంటి శుభ్ర షవర్‌లను ఏర్పాటు చేసుకున్నారు.

కార్మికులకు చైతన్యం

పరిశ్రమల్లో పని చేసే ప్రతి కార్మికుడిని చైతన్యం చేసే చర్యలు ప్రతి పరిశ్రమలో కనిపిస్తాయి. మాక్‌డ్రిల్ ద్వారా కార్మికుల అప్రమత్తతను పరీక్షిస్తారు. నెలకు ఓసారి మాక్ డ్రిల్ ఉంటుంది. పరిశ్రమల గోడలపై కార్మికులు, ప్రతినిధుల అవగాహనకు చిత్రాలు వేస్తారు. అవి చాలా తోడ్పడతాయని ఎస్ఎంఎస్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ టీఎస్ఎం శేఖర్ చెప్పారు. కార్మికులకు భద్రత పోటీలు నిర్వహిస్తారు. చైతన్యం కలిగిస్తారు. ఉత్పత్తులకు ఆర్డర్లు ఇచ్చే వివిధ దేశాల ప్రతినిధులు సైతం కార్మికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను ఆరా తీస్తారు.

అప్రమత్తతే ఆయుధం

– పీవీ నాయుడు, పరిశ్రమ భద్రతా విభాగ అధికారి



పరిశ్రమల్లో పని చేసే ప్రతి కార్మికుడు అప్రమత్తంగా ఉండాలి. యాజమాన్యాలు ప్రత్యేక శిక్షణ ఇవ్వటంతో పాటు అందుబాటులోకి వచ్చిన పరికరాలను సమకూర్చుకుంటాయి. అన్ని రకాల రసాయన పరిశ్రమల్లో ఈ విధానం కనిపిస్తుంది.

మార్పులతోనే మార్కెట్‌ను ఎదుర్కోగలం

– నాగేశ్వరరావు, పరిశ్రమల విభాగం ఎండీ, ఐడీఏ బొల్లారం



ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యాజమాన్యాలు మార్చుకుంటున్నాయి. అప్పుడే నేటి మార్కెట్‌ను ఎదుర్కోగలమని గ్రహించారు. ఆధునిక పరికరాలు సమకూర్చుకుంటున్నాయి.

'కాగ్నిజెంట్'లో గురుకుల విద్యార్థులు

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థినులు బుధవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని కాగ్నిజెంట్ సంస్థను సందర్శించారు. విద్యాలయం నుంచి వెళ్లిన 15 మంది విద్యార్థినులతో విదేశాలకు చెందిన సంస్థ ప్రతినిధులు మమేకమై పలు అంశాలపై అవగాహన కల్పించారు.

సమీకృత మార్కెట్ సందర్శన

గజ్వేల్, న్యూస్‌టుడే: గజ్వేల్ సమీకృత మార్కెట్‌ను సూర్యాపేట జిల్లా మార్కెటింగ్, పురపాలక శాఖ అధికారులు బుధవారంసందర్శించారు. డీఎంవో సంతోష్ కుమార్, డీఈ సత్యనారాయణ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు మార్కెట్లో కలియతిరిగి రైతులు, వ్యాపారులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో జరుగుతున్న లావాదేవీల గురించి కార్యదర్శి జాన్ వెస్లీ వారికి వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

అనుమతి లేకుండా డ్రోన్లు ఎగురవేస్తే చర్యలు

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా రాత్రిపూట డ్రోన్లు ఎగురవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అబ్దుల్ రవూఫ్ హెచ్చరించారు. గత కొన్ని రోజులుగా దుద్యాల మండలంలోని లగచెర్ల, చుట్టు పక్కల గ్రామాల్లో రాత్రి 7 నుంచి 10 గంటల మధ్య డ్రోన్లు తిరుగుతున్నాయని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయండి

పెద్దేముల్, న్యూస్‌టుడే: ప్రజలకు పరిశుభ్రమైన, స్వచ్ఛతతో కూడిన తాగునీటిని అందించవలసిన బాధ్యత గ్రామ సహాయకులపై ఉందని గ్రామీణ తాగునీటి పథకం ఎస్ఈ ఆంజనేయులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సహాయకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తాగునీటి క్లోరినేషన్, ట్యాంకుల పరిశుభ్రత, నీటిలో లవణాలు, నాణ్యత, చేతిపంపుల మరమ్మతులపై ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జర్నప్ప, ఎంపీవో రతన్‌సింగ్, ఏఈలు అఖిల్, ప్రతిభ, శిక్షకులు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట: శిక్షణలో నేర్చుకున్న వివిధ అంశాలకు ఆచరణలో పెట్టాలని డీఈ రత్న ప్రసాద్ అన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో వాటర్‌మెన్‌ల శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశంలో మాట్లాడారు.

నూతన ఉపాధ్యాయులకు సత్కారం

యాలాల: డీఎస్సీలో యాలాల మండలానికి వచ్చిన నూతన ఉపాధ్యాయులను బుధవారం తపస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా చదువు నేర్పాలన్నారు

రైతుల జేబులు గుల్ల

తప్పని నియంత్రిక తరలింపు కష్టాలు





వాహనంలో తీసుకొచ్చిన నియంత్రిక

మరమ్మతు పనులు

పరిగి, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో జూన్ మాసంలో 52 నియంత్రికలు కాలిపోయాయి. జులైలో అత్యధికంగా 80, ఆగస్టులో 49, సెప్టెంబరులో 55, అక్టోబరులో ఇప్పటి వరకు 42 పాడయ్యాయి. మరమ్మతు కేంద్రానికి వాటిని తీరలించడం అన్నదాతకు తలకు మించిన భారంగా మారింది.

– న్యూస్‌టుడే, పరిగి

యాసంగి సీజన్ ప్రారంభమైంది. నిరంతరంగా వ్యవసాయ పంపు సెట్లు పనిచేస్తున్నాయి. వివిధ కారణాలతో నియంత్రికలపై భారం పడి అవి తరచూ కాలిపోతున్నాయి. వాటిని బాగు చేయించేందుకు పరిగిలోని మరమ్మతు కేంద్రానికి తీసుకరావాల్సి ఉంటోంది. పరిగితో పాటు కుల్కచర్ల, పూడూరు, దోమ, చౌడాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల రైతులంతా ఇక్కడకు రావాల్సిందే. ప్రభుత్వ పరంగా నియంత్రికలను తరలించేందుకు ప్రత్యేక వాహనం లేకపోవడంతో రవాణా ఛార్జీల భారం రైతు నెత్తిన పడుతోంది. దూరాభారాన్ని బట్టి ప్రైవేట్ వాహనదారులు అడిగినంత కిరాయి చెల్లించాల్సి వస్తోంది. లేదంటే పంట పొలాలు దెబ్బతినే ప్రమాదముంది. ఇదే అవకాశంగా భావిస్తున్న వాహనదారులు రైతుల జేబులు గుల్ల చేస్తున్నారు. ట్రాక్టరు రూ.2,500 నుంచి రూ.3వేల వరకు చెల్లిస్తున్నామని కర్షకులు వాపోతున్నారు.

భారాన్ని తగ్గించాలి



ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇప్పటికే అనేక కష్టాలు పడుతున్నారు. పెట్టుబడుల సీజన్ కావడంతో అప్పులు పుట్టడం కష్టంగా మారింది. నియంత్రికలు కాలిపోతే దాని పరిధిలో ఉన్న రైతులు తలా కొంత మొత్తాన్ని పోగు చేసుకుని వాహనంలో పరిగికి తేవాల్సి వస్తోంది. దీంతో భారం నెత్తిన పడి అవస్థలు పడుతున్నాం. మరమ్మతు కేంద్రానికి ప్రభుత్వ పరంగా ప్రత్యేక వాహనాన్ని సమకూర్చాలి.

– ఎల్లప్ప, రైతు, రాంపూర్, కుల్కచర్ల మండలం

ఆరంభ శూరత్వమే..

డివిజన్ వ్యాప్తంగా 33/11కేవీ విద్యుత్తు ఉపకేంద్రాలు 12 ఉండగా మరో రెండు 132 కేవీ ఉప కేంద్రాలు పనిచేస్తున్నాయి. పరిగి మండలంలో వ్యవసాయ కనెక్షన్లు 4,936 ఉండగా దోమ మండలంలో 5,205, కుల్కచర్ల మండలంలో 3,543, చౌడాపూర్ మండలంలో 1,933 కనెక్షన్లు ఉన్నాయి. పెరిగిన కరెంటు వినియోగంతో నియంత్రికలు మొరాయిస్తున్నాయి. కాలిపోయిన వాటిని తీసుకురావడం, బాగు చేసిన అనంతరం తిరిగి వ్యవసాయ క్షేత్రాలకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వ పరంగా వాహనాన్ని సమకూర్చాలన్న రైతుల వినతులు ఎవరూ పట్టించుకోవడం లేదు. గతేడాది ప్రభుత్వం రవాణా ఛార్జీలను చెల్లిస్తున్నట్లు ప్రకటించింది ఆమేరకు రైతుల ఖాతాల్లో జమ చేసింది. కానీ ఇది ఆర్థిక భారంతో కూడుకున్నదని భావించి మళ్లీ వెనక్కి తగ్గింది. దీంతో అమలు ఆరంభ శూరత్వంగా మారింది.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ, ధారూర్, కుల్కచర్ల గ్రామీణ:

? పొలాల్లో విద్యుత్తు స్తంభాల మధ్య దూరం పెరగడంతో 5 అడుగుల కిందికి విద్యుత్తు తీగలు వేలాడుతూ.. ప్రమాదకరంగా తయారయ్యాయి. మధ్యలో అదనంగా ఏర్పాటు చేసేందుకు స్తంభాలు కూడా ఇచ్చారు. కానీ ఏడాదికి పైగా విద్యుత్తు సిబ్బంది వాటిని ఏర్పాటు చేయడంలేదు. –శ్రీశైలం, రాజు, ఆంజనేయులు, రామచంద్రయ్య రైతులు రాపోల్ గ్రామం

✓ వారి పొలాలకు వెళ్లి లైన్ పరిశీలించిన తర్వాత పని జరిగేలా చూస్తాం. – పరిగి నర్సింలు, లైన్‌మెన్, విద్యుత్ శాఖ.

? దోర్నాల్ గ్రామ సమీపంలో రోడ్డుపై కంకరతేలి గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలకు నిత్యం అవస్థలు పడుతున్నాం. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలకు గురవుతున్నాం. – రాములు, నాగారం

✓ రోడ్డు మరమ్మతులకోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభించి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. – ప్రణీత్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధారూర్.

? అల్లాపూర్ తండాలో సౌర మోటారు పంపు పాడైపోయి చాలా రోజులు కావస్తోంది. భగీరథ నీటి సరఫరా లేని సమయంలో తండావాసులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరమ్మతులు చేయించేలా చూడాలి. – రవి, స్థానికుడు.

✓ సౌర మోటారు పంపు పాడైపోయిందనేది వాస్తవమే. ఈ సమస్యను మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతులు చేయించేలా చూస్తాం.– మైముదాబేగం, పంచాయతీ కార్యదర్శి.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

యాలాల, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం హాజీపూర్ గ్రామ భారాస మాజీ సర్పంచి ఒంగోనిబాయి శ్రీనివాస్‌తో కలిసి దాదాపు వంద మంది ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

మోమిన్‌పేట: మహిళా ఆర్థిక పురోగతికి ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఏపీఎం రాజు గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు సూచించారు. బుధవారం పొదుపు సంఘం సర్వసభ సమావేశం అధ్యక్షురాలు ఈశ్వరమ్మ అధ్యక్షతన మోమిన్‌పేటలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

కోతలకు సై..!

వరికోత యంత్రాలు సిద్ధం



తాండూరు నూర్పిడి యంత్రాలు

న్యూస్‌టుడే, తాండూరు: జిల్లాలో వానాకాలం వరి కోతలు మరో వారం రోజుల నుంచి ముమ్మరం కానున్నాయి. ఈ నేపథ్యంలో వరికోత యంత్రాలను యజమానులు సిద్ధం చేస్తున్నారు. మరమ్మతుకు వచ్చిన వాటిని బాగు చేస్తున్నారు. రెండు నెలల వరకు కోతలు జరగనున్నాయి.

ఇదిగో ఇలా.. వరిని సాగు చేసిన రైతులు కంకులు ఎండగానే యంత్రాలను నేరుగా పొలాల్లోకి దింపనున్నారు. ఇందు కోసం ఇప్పటికే తమ పొలాల్లో కోతలు ఎప్పుడు ప్రారంభించాలనే విషయంలో తేదీలను ఖరారు చేసి యంత్రాల యజమానులతో మాట్లాడుకున్నారు. కొంతమేర బయానా రూపంలోనూ ఇచ్చారు. పొలాల్లోకి వచ్చే యంత్రాలు వరి కోతలు ప్రారంభించగానే గింజలు వేరౌతాయి. ఇలా యంత్రం డబ్బాలోకి వెళ్లిన గింజలను నిర్ణీత ప్రదేశంలో కుప్పగా పోస్తుంది. రైతులు వాటిని ఆరబెట్టిన అనంతరం నేరుగా సంచుల్లోకి నింపి అందుబాటులో ఉన్న కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. పంట సాగు విషయంలో ఇబ్బందులు తలెత్తినా.. కోతల విషయంలో జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రస్తుతం అక్కడక్కడా కోతలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల్లో అన్ని మండలాల్లో ఊపందుకోనున్నాయి.

రూ.కోట్లలో ఆదాయం..

వరిని కోసే యంత్రాల యజమానులు ఈసారి రూ.32.50కోట్లను ఆర్జించబోతున్నారని పలువురు చెబుతున్నారు. జిల్లాలో 50కి మించి యంత్రాలు లేవు. పొరుగు జిల్లాల నుంచి వాటిని తెప్పిస్తున్నారు. గంటకు రూ.2,500 చొప్పున కోతలు కోసేందుకు రైతుల వద్ద వసూలు చేయనున్నారు. ఎకరం పొలంలో కోతలు కోయాలంటే గంట సమయం పడుతుంది. ఈ లెక్కన జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో పంట సాగైంది. మొత్తం పంటను కోసే యంత్రాలు గంటకు రూ.2,500 చొప్పున యజమానులు రూ32.50 కోట్లను ఆర్జించనున్నాయి. ఇందులో సగం మేర నిర్వహణ ఖర్చులు పోయినా మిగిలిన సగం మిగులుతుందని పలువురు పేర్కొంటున్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



పరిగిలో నిర్వహించిన హోమం

పరిగి, న్యూస్‌టుడే: పరిగి పట్టణంలో రెండు రోజులుగా శ్రీలక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం వేదస్వస్తి హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో సిద్ధాంతి పార్థసారథి, మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌కుమార్, నార్మాక్స్ మాజీ డైరెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, విపణి మాజీ ఛైర్మన్ ఎస్పీ.బాబయ్య, ఆలయ ధర్మకర్త ఎదిరె కృష్ణ పాల్గొన్నారు.

పెద్దఉమ్మెంతాల్‌లో గీతాయజ్ఞం

పూడూరు: పెద్దఉమ్మెంతాల్‌లో వెలసిన శ్రీ తిరుమలనాథస్వామి ఉత్సవాలు జరుగుతున్నాయి. రోజువారీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో సామూహిక గీతాయజ్ఞం జరిగింది. ఆలయ పీఠాధిపతులు శ్రీ వెంకటదాసు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రహరీ లేక పాట్లు



తాండూరుగ్రామీణ: జిన్ గుర్తితండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించలేదు. పాఠశాల భవనం ముందు రూ.లక్ష విలువ జేసే క్రీడా సామగ్రికి, బోరుకు భద్రత కరవైంది. తరగతి గదుల్లోకి పాములు వస్తుండగా విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. మూగజీవాలు పాఠశాల పరిసరాల్లోకి వస్తుండడంతో చిట్టిపొట్టి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ధారూర్: ఉర్దూమాధ్యమ పాఠశాల, ఈద్గాకు ప్రహరీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మజ్లిస్‌పార్టీ మండల అధ్యక్షుడు మోయిజ్ ఖురేషీ డిమాండ్ చేశారు. బుధవారం శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గోడలు లేకపోవడంతో సెలవురోజుల్లో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని పేర్కొన్నారు.

దారి పక్కనే గుంత



కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: బొంరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కనే కల్వర్టు దగ్గర ఓ గుంత ప్రమాదకరంగా మారింది. మట్టి కొట్టుకుపోవడంతో భారీ గొయ్యి ఏర్పడింది. వాహనాలు రాత్రి సమయంలో అటువైపు వెళితే ప్రమాదం జరగడానికి అవకాశం ఉంది. చాలా రోజులుగా ఈ సమస్య ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వంతెన శిథిలం.. రాకపోకలకు భయం



వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: సర్పన్‌పల్లి, గోధుమగూడ, ద్యాచారం, ఐనాపూర్, గొట్టిముక్కుల గ్రామాల ప్రజలకు ఇబ్బందుల్ని రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. పండించిన ధాన్యం ఇంటికి తీసుకు వెళ్లాలన్నా.. మార్కెట్ తరలించాలన్నా.. ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వంతెన కింద ఉన్న రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారడం, కాస్త ఎత్తైన వాహనాలు వెళ్లకుండా.. ఇనుప చువ్వలు వేయడం ఇబ్బందిగా మారింది. పలుమార్లు రైల్వే అధికారులను కలిసి విన్నవించినా.. మరమ్మతులు చేయడం లేదు. గ్రామాల నుంచి అత్యవసరమైతే వెళ్లడానికి గొట్టిముక్కుల నుంచి.. చుట్టూ తిరిగి వికారాబాద్ రావాల్సి వస్తుందని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అందుబాటులోకి ఆకాశ దీపాలు



పూడూరు, న్యూస్‌టుడే: పూడూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆకాశ దీపాలు అందుబాటులోకి వచ్చాయి. వీధుల్లో స్తంభాలకు సక్రమంగా లైట్లు లేకపోవడంతో చాలా రోజులుగా చీకటి నెలకొంది. స్థానికులు సమస్యను ఇటీవల ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే దీపాలు మంజూరు చేయించారు. దీంతో మంగళవారం కూడలిలో బిగించే పనులు పూర్తి చేశారు.

విధులకు సకాలంలో హాజరు తప్పనిసరి



వైద్యాధికారిని ప్రశ్నిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు, తదితరులు

కుల్కచర్ల, న్యూస్‌టుడే: విధులకు సక్రమంగా హాజరై రోగులకు సరైన సేవలు అందించాలని పీఏసీఎస్ అధ్యక్షుడు మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి వైద్యాధికారికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. వైద్యాధికారి వాజీఉద్దీన్‌తో మాట్లాడారు. విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని తమ దృష్టికి వచ్చిందని అది సరైన పద్ధతి కాదని సూచించారు. దీనికి స్పందించి వైద్యాధికారి తాను విధులకు సక్రమంగా హాజరవుతానని హామీ ఇచ్చారు.

గొప్ప వ్యక్తులపై యువతకు అవగాహన



వాల్యానాయక్‌తండాలో వివరిస్తున్న గిరిజన నేతలు

కుల్కచర్ల, న్యూస్‌టుడే: గిరిజనుల అభ్యున్నతికి కృషి చేసిన గొప్పవ్యక్తుల్ని నేటి తరం తెలుసు కోవాల్సిన అవసరం ఉందని మాజీ సర్పంచి గోబ్ర్యానాయక్ అన్నారు. వాల్యానాయక్‌తండాలో గిరిజనులతో గోర్సిక్వాడీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శంకర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ గాంగ్యానాయక్ పాల్గొన్నారు.

సర్కారు బడులకు పంపితే మేలు

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని ఎంఈవో హరిలాల్ సూచించారు. బుధవారం బొంరాస్‌పేట మండలంలోని మూడుమామిళ్ల తండా పాఠశాలను ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతూ.. జూన్ నుంచి పిల్లలు ప్రైవేటు పాఠశాలకు వెళ్తున్నందున అక్కడి టీచర్లను రేగడి మైలారం పాఠశాలకు పంపించామన్నారు. కార్యక్రమంలో చౌదర్‌పల్లి జీహెచ్‌ఎం రవీందర్‌గౌడ్, సీఆర్పీ సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో సమస్యలు పరిష్కరించరూ..

దుద్యాల, న్యూస్‌టుడే: ఈర్లపల్లి, సంత్రకుంటతండాలో నెలకొన్న సమస్యలపై బుధవారం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కొత్త గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలని, 4 అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలనే తదితర సమస్యలపై వినతిపత్రం అందించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: తాండూరు అయ్యప్పస్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపును బుధవారం నిర్వహించారు. రూ.46,632ల ఆదాయం సమకూరింది. అంతకుముందు ఆలయంలో మణికంఠుడి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాంజాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు. ఏర్పాట్లను ఆలయ సంఘం ప్రతినిధులు మనోజ్‌గౌడ్, గోపాల్‌యాదవ్, నవీన్‌కుమార్, రమేష్, మల్లేష్, అరుణ్‌చారీ పర్యవేక్షించారు.

దాడులు చేసిన వారిని శిక్షించాలి



ఎస్సైకి వినతి పత్రం అందిస్తున్న సమితి సభ్యులు

కొడంగల్, న్యూస్‌టుడే: దేవతల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వారు వినాయకకూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్సై సత్యనారాయణకు, తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాలు అందించారు.

నిషేధిత భూముల్లో కట్టడాలు

పరిగి: సుల్తాన్‌పూర్ శివారులో ఉన్న నిషేధిత భూముల్లో అభివృద్ధి పేరిట కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని తక్షణం నిలిపి వేయాలని పలువురు తహసీల్దారు ఆనంద్‌రావును కోరారు. లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. గ్రామకంఠం భూమిని కూడా వదలడం లేదని అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

నేడు కలెక్టర్, ఎమ్మెల్యేల పర్యటన

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో నేడు కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటించనున్నారని ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అశోక్, ఆంజనేయులు తెలిపారు. కుల్కచర్ల మండల పరిధిలోని అల్మాస్‌ఖాన్‌పేట భూములు, మందిపల్ పరిధిలోని అసైన్‌మెంట్ భూములను వారు పరిశీలిస్తారని, సంబంధిత రైతులతోను మాట్లాడతారన్నారు.

అటవీ భూమిని ఆక్రమించారని ఫిర్యాదు

ధారూర్, న్యూస్‌టుడే: అటవీ భూమిని ఆక్రమించారని ధారూర్ డిప్యూటీ రేంజ్ అధికారిణి హేమ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాంపూర్ గ్రామ సమీపంలోని భూమిలో గట్టెపల్లి గ్రామానికి చెందిన పాత్లావత్ శంకర్, పాత్లావత్ మల్లేష్ కొంత భాగం ఆక్రమించుకొని పంటలు వేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు మహిళా సమాఖ్య సమావేశం

పెద్దేముల్, న్యూస్‌టుడే: మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని ఏపీఎం బాలయ్య తెలిపారు. సమావేశం మహిళ సమైక్య భవనంలో జరుగుతుందని చెప్పారు. రుణాలు, పథకాలపై చర్చిస్తామన్నారు.

బస్సులు లేక విద్యార్థుల కష్టాలు

దుద్యాల, కొడంగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థుల సంఖ్యకనుగుణంగా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ నాయకులు బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రుద్రారం నుంచి టేకుల్‌కోడ్, అన్నారం, అంగడిరైచూర్, లక్ష్మీపల్లి, సంగాయపల్లి గ్రామాల నుంచి చదువులకు కొడంగల్‌కు వందల సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈ విషయంపై ఎన్ని సార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు.

సారూ.. కంచె వేయరూ..



తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: కోనాపూర్‌లో ప్రధాన రహదారిని ఆనుకొని నియంత్రికను ఏర్పాటు చేశారు. చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు. ఎర్తింగ్ తీగలను నేలలో అమర్చారు. స్థానికులు, మూగ జీవాలు విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నీటి వృథాను అరికట్టండి



దుద్యాల, న్యూస్‌టుడే: అల్లిఖాన్‌పల్లి ప్రధాన రోడ్డు పక్కన తాగునీరు వృథాగా పోతోంది. ప్రజలకు అవసరమైనంత మేర వినియోగించుకొని సింగిల్ ఫేజ్ మోటారును బంద్ చేయకపోవడంతో నిరంతరంగా తాగునీరు మురుగు కాల్వలోకి వెళ్లిపోతోందని గ్రామస్థులు తెలిపారు. సంబంధిత అధికారులు నీరు వృథా కాకుండా చూడాలని కోరుతున్నారు.

మంచు దారి.. మృత్యు కౌగిలి

వాహనదారులూ జరపైలం



ఉదయం వేళ కురుస్తున్న మంచు

న్యూస్‌టుడే, పూడూరు: వారం రోజులుగా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మంచుకురుస్తోంది. ఉదయం దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులకు రోడ్డు కన్పించడం లేదు. లైట్లు వేసినా.. అంతా మసక మసకగానే కన్పిస్తోంది. చాలా సందర్భాల్లో ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదం బారిన పడుతున్నాయి.

ఇలా చేస్తే మేలు



గత ఏడాది శివసాగర్‌లోకి దూసుకుపోయిన కారు

- మంచు దట్టంగా కమ్ముకుంటే.. వెంటనే ప్రయాణం ఆపాలి.
- వాహనాన్ని రోడ్డు పక్కన నిలుపరాదు, వెంటనే రోడ్డు కిందకు దించుకోవాలి.
- లైట్లు వేసుకుని వెళ్లడంతో ముందుగా వచ్చే వాహనాన్ని గుర్తించేందుకు అవకాశం ఉంటుంది.
- మసక వెలుతురులో ప్రయాణం వద్దు.
- కార్ల అద్దాలు వెంటవెంటనే శుభ్రం చేసుకోవాలి.
- మలుపులు, స్పీడ్ బ్రేకర్లు, గుంతలు సక్రమంగా కనిపించకుంటే అదుపు తప్పేందుకు ఆస్కారం ఉంది.

కొన్ని ఘటనలు..

- ఏడాది క్రితం నగరానికి చెందిన కొందరు సెలవు రోజున కోట్‌పల్లి ప్రాజెక్టుకు వెళ్లేందుకు కారులో బయలుదేరారు. ఉదయం విపరీతంగా ఉన్న పొగ మంచుతో దారి సక్రమంగా కనిపించ లేదు. ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి శివసాగర్ చెరువులోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు గల్లంతై మృత్యువాత పడ్డాడు.
- పూడూరు మండలం కంకల్ నుంచి చన్‌గోముల్ వెళ్లేదారిలో మలుపువద్ద ఉన్న పాత బావిలో ఆటోపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. మరో ఇద్దరు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.
- దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై రక్షణగోడ లేక ఏడాది క్రితం ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెరువులోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు.
- రెండేళ్ల క్రితం పూడూరు గేటు సమీపంలో జాతీయ రహదారిలో కూరగాయలతో వెళ్తున్న ఆటోను సిమెంట్ ట్యాంకరు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందాడు.

జాగ్రత్తలు తప్పనిసరి

– మధుసూదన్‌రెడ్డి, ఎస్సై

తెల్లవారుజామున మంచు కురిసే సీజన్ కావడంతో వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలి. తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో అవసరమైతే ప్రయాణం మానుకోవాలి. కొద్దిగా ఆలస్యం అయినా సరే వాహనాన్ని రోడ్డు కిందికి దించి నిలుపుకోవాలి. మంచు తగ్గిన తరువాత సురక్షితంగా చేరుకునేందుకు అవకాశం ఉంటుంది. అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు కృషిచేస్తాం.